సాక్షి నల్లగొండ

మంగళవారం : 7 : మే : 2024



వైఎస్సార్ శిష్యులం..
'మేము వైఎస్సార్ శిష్యులం.. మాట ఇస్తే తప్పం' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. - IIలో



ఎన్నికల విధుల్లో వలంటీర్లు
పోలింగ్ సజావుగా సాగేందుకు ఎన్నికల కమిషన్ ఈసారి పోలింగ్ బూత్‌ల వద్ద వలంటీర్లను నియమించింది. - IIలో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
42° / 28°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఈవీఎంల కమిషనింగ్ పరిశీలన



ఈవీఎంల కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు

దేవరకొండ : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల కమిషనింగ్‌ను సోమవారం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ దేవరకొండలో పరిశీలించారు. కమిషనింగ్ సమయంలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయా అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, తహసీల్దార్ సంతోష్ కిరణ్ తదితరులు ఉన్నారు.

శాసనాలే చరిత్రకు ఆధారాలు



చందుపట్లలో రుద్రమదేవి శాసనాన్ని పరిశీలిస్తున్న పరిశోధకుడు డాక్టర్ స్వామి

నకిరేకల్ : ఆనాటి శాసనాలే చరిత్రకు ఆధారాలని, అవే చరిత్రను నిర్మిస్తాయని ప్రముఖ గ్రామ నామాల పరిశోధకుడు డాక్టర్ మండల స్వామి అన్నారు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలోని రాణి రుద్రమదేవి మరణ శాసనాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందుపట్ల గ్రామ చరిత్రను ముందుతరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శాసనాన్ని వెలుగులోకి తేవడానికి కృషి చేసిన యువ పరిశోధకుడు టంగుటూరి సైదులును అభినందించారు. ఆయన వెంట సృజన సాహితీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, ప్రముఖ పరిశోధకులు కనకటి రామకృష్ణ, టంగుటూరి సైదులు తదితరులు ఉన్నారు.

శివుడికి అభిషేకం, అర్చనలు



శివాలయంలో స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపై ప్రధానాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర కైంకర్యాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, అర్చన, నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

గడప గడపకు..

ఇంటింటి ప్రచారానికి ప్రధాన పార్టీల శ్రీకారం

- మొన్నటి వరకు నియోజకవర్గ, బూత్ స్థాయి సమావేశాలు
- జాతీయ, రాష్ట్ర నేతలతో రోడ్ షోలు, బస్సు యాత్రలు
- పోలింగ్ గడువు దగ్గర పడుతుండడంతో ఇంటింటికి వెళ్లి ఓట్లు అడుగుతున్న నేతలు
- బూత్ స్థాయిలో ప్రచారాలు మొదలుపెట్టిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ



నల్లగొండలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీలన్నీ ఇంటింటి ప్రచారం చేపట్టాయి. మొన్నటి వరకు నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు రోడ్ షోలు, బస్సు యాత్రలు నిర్వహించాయి. ఆ సమావేశాలకు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. ఇప్పుడు ప్రచారం చివరి అంకానికి చేరుతుండటంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఓ వైపు బహిరంగ సభలను నిర్వహిస్తూనే మరోవైపు బూత్‌ల వారీగా నేతలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేస్తున్నాయి.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

మొన్నటివరకు భారీగా సభలు, రోడ్‌షోలు

కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్ స్థాయి సమావేశాలు నిర్వహించింది. ఇప్పటి వరకు నిర్వహించిన రోడ్‌షోలు, సభలు, సమావేశాల్లో ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ శాసనసభ్యులతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి పాల్గొని ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్ స్థాయి కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయా బూత్‌ల పరిధిలో ఓటర్లను తమ వైపు ఎలా మళ్లించుకోవాలో దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు బాధ్యతను అప్పగించారు. ఈ సభలు, సమావేశాల్లో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు పాల్గొన్నారు. ఇక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మొదట మిర్యాలగూడ నుంచే బస్ యాత్రను ప్రారంభించి సూర్యాపేట మీదుగా యాదాద్రి భువనగిరిలో రోడ్‌షోలో పాల్గొన్నారు. ఇక, బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని కోరుతూ నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు రోడ్‌షోలో పాల్గొనగా సోమవారం నల్లగొండలోజరిగిన బహిరంగసభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొన్నారు.

ఓటర్లను ఆకర్షించేందుకు..

రెండు రోజుల నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఓటర్ల ఇంటిబాట పట్టాయి. మున్సిపాలిటీలు, గ్రామాల్లో బూత్‌ల వారీగా ఇంటింటి ప్రచారం మొదలు పెట్టాయి. కాంగ్రెస్ నాయకులు ఒక్కో బూత్‌కు ఇన్‌చార్జిలను నియమించి, ప్రతి రోజు ఆ బూత్ పరిధిలో ఉన్న ఓటర్ల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు, స్టిక్కర్లు అంటించడంతో పాటు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు ఉంటే వారికి లేదా పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. నల్లగొండ నియోజకవర్గం పరిధిలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ఇతర నేతలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనూ ఇంటింటి ప్రచారం మొదలు పెట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నేతలు మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రతి ఇల్లూ తిరిగి ప్రచారం చేస్తున్నారు. నల్లగొండలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆయన సతీమణి గుంటకండ్ల సునీత జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సతీమణి కంచర్ల రమాదేవి పాల్గొని నియోజక వర్గంలో బీఆర్ఎస్‌కు ఓటేయాలని ప్రచారాలు చేస్తున్నారు.
- బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తరపున ఆ పార్టీ నేతలు ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఇతర నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను తమవైపు మళ్లించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

భువనగిరి పరిధిలో..

భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపుకోసం ఆ పార్టీ నేతలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. సభలు, సమావేశాల్లో పార్టీ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొంటుండగా, పార్టీ నేతలు ఇంటింటి ప్రచారంలో నిమగ్నమయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్, బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ కూడా ఇంటింటి ప్రచారం చేపట్టారు.



మిర్యాలగూడ మండలం తుంగపాడులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



త్రిపురారం మండలం కంపాసాగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు

కమల దళంలో ఉత్సాహం



సభలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, పక్కన ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి, నాయకులు

- నల్లగొండ జనసభకు భారీగా తరలివచ్చిన కాషాయ పార్టీ శ్రేణులు
- కార్యకర్తలను ఆకట్టుకున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ప్రసంగం
- సైదిరెడ్డి గెలుపుతోనే నల్లగొండ అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్య

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల ఔట్‌డోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన బీజేపీ జనసభ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రసంగం కార్యకర్తలను ఆకట్టుకుంది. రేణుకా ఎల్లమ్మ దేవి అంటూ జేపీ నడ్డా తన ప్రసంగం మొదలు పెట్టడంతో యువత కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను, సోనియా, రాహుల్, ప్రియాంక మాటలను ప్రజలు నమ్మడం లేదన్నారు. బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుపుతోనే నల్లగొండ అభివృద్ధి సాధ్యమన్నారు. ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వుకు ఓటేసి యువకుడైన సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ మరో ఆరు నెలలు, లేదా సంవత్సరంలోగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందన్నారు. తొందరలోనే బీజేపీ ప్రభుత్వం వస్తుందని.. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ ఎమ్మెల్యేలే ఉంటారని తెలిపారు. నల్లగొండ సమస్యలపై దమ్ముంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు తనతో చర్చకు రావాలని సవాల్ చేశారు. తాను 2 లక్షల మెజార్టీతో గెలవబోతున్నానని, ఎక్కడికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. నల్లగొండ బీజేపీ గడ్డ అని, కాషాయం జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడ యువతకు 50 వేల ఉద్యోగాలు కల్పిస్తామని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు ఇండస్ట్రియల్ కారిడార్ తీసుకొస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి గాడిద గుడ్డు చూపిస్తున్నారని.. ఆయన ఇచ్చిన హామీలు మహిళలకు రూ.2500, యువతుల పెళ్లిళ్లకు తులం బంగారం, రైతు రుణమాఫీ, కౌలు రైతులకు రూ.12 వేలు, ఆరు గ్యారంటీలు ఎందుకు హామీ చేయలేదని ప్రశ్నించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ అబద్దపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. జిల్లాలో వారసత్వ రాజకీయాలను తరిమేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, చాడ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, చింతా సాంబమూర్తి, గోలి మధుసూదన్ రెడ్డి, నూకల నరసింహారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, జుట్టుకొండ సత్యనారాయణ, కంకణాల నివేదిత, పోతెపాక సాంబయ్య, లాలూనాయక్, సాధినేని శ్రీనివాసరావు, పెరిక మునికుమార్, గడ్డం మహేష్ తదితరులు పాల్గొన్నారు.



జనసభకు హాజరైన బీజేపీ శ్రేణులు

విధుల కేటాయింపులో అవకతవకలు లేవు

- మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి
- రిక్వెస్ట్ లెటర్లు ఇచ్చినవారికి మినహాయింపు ఇచ్చామని వెల్లడి
- ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి విధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వని అధికారి



నల్లగొండ : ఎన్నికల విధుల కేటాయింపు విషయంలో కొందరు రిక్వెస్ట్ లెటర్ పెట్టుకుంటే డ్యూటీలు క్యాన్సిల్ చేశారట. ఎన్నికల విధులకు సరిపడా సిబ్బంది ఉండటంతోనే మరికొందరికి అసలు డ్యూటీలే వేయలేదట! ఇదీ ఉద్యోగులకు ఎన్నికల విధుల కేటాయింపులో జిల్లా యంత్రాంగం అనుసరించిన తీరు. ఈ విషయాన్ని స్వయంగా అధికారులే చెప్పడం విశేషం. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న వారికి, రెండు నెలల్లో రిటైర్‌మెంట్ ఉన్నవారికి, బాలింతలు, గర్భిణులకు డ్యూటీలు వేశారని.. ఈనెల 5న 'సాక్షి'లో 'ఎన్నికల విధుల కేటాయింపులో ఇష్టారాజ్యం' శీర్షికన ప్రచురితమైన కథనంపై మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి స్పందించి పై విషయం చెప్పుకొచ్చారు. ఎన్నికల విధుల కేటాయింపుల్లో ఎక్కడా అవకతవకలు జరగలేదని పేర్కొన్నారు. కానీ, సమస్యలు ఎదుర్కొంటున్న వారికి డ్యూటీలు ఎలా వేశారనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వకపోవడం కొసమెరుపు.

ధ్రువీకరణ పత్రాల ఆధారంగా..

- నార్కట్‌పల్లి మండలంలో వివిధపాఠశాలల్లో పని చేస్తున్న 22 మందికి విధులు కేటాయించలేదని.. ఇందులో 15 మందికి వారు సమర్పించిన ధ్రువీకరణ పత్రాల ఆధారంగా విధుల నుంచి మినహాయింపు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు సరిపడా సిబ్బంది ఉన్నందున మిగిలిన ఏడుగురికి విధులు కేటాయించలేదని పేర్కొన్నారు.
- కనగల్ మండలంలో ఏడుగురికి విధులు కేటాయించలేదని.. ఇందులో ముగ్గురికి వారు సమర్పించిన ధ్రువీకరణ పత్రాల ఆధారంగా మినహాయింపు ఇచ్చామని, మిగిలిన వారికి అసలు విధులు కేటాయించలేదని తెలిపారు.
- గుర్రంపోడు మండలంలో 17 మందికి విధులు కేటాయించలేదని అందులో 16 మంది వారు సమర్పించిన ధ్రువీకరణ పత్రాల ఆధారంగా విధుల నుంచి మినహాయింపు ఇచ్చామని.. అక్కడ కూడా ఒకరికి విధులు కేటాయించలేదని పేర్కొన్నారు.

లడ్డూ నాణ్యత, సైజులో తేడా రావద్దు

- యాదాద్రి ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు స్వచ్ఛమైన లడ్డూలు అందజేయాలని దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు అక్కడి బాధ్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఆలయ సన్నిధిలో ఉన్న లడ్డూ తయారీ విభాగాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. లడ్డూ తయారీ నాణ్యత, పరిమాణం(సైజు)పై సెక్షన్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. లడ్డూ తయారీలో పరిమాణం, నాణ్యతలో ప్రమాణాలు పాటించాలని, తేడా రావద్దని సూచించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన లడ్డూను తిని రుచి చూశారు. అనంతరం టిక్కెట్ కౌంటర్‌కు వెళ్లి పరిశీలించారు.



లడ్డూను పరిశీలిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

నల్లగొండ టౌన్ : వానాకాలం సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో 11.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు అవుతాయని తెలిపారు. అందులో ఎక్కువగా 5.50 లక్షల ఎకరాల్లో పత్తి, 5.15 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని పేర్కొన్నారు. వరిలో 2.80 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం, 2.20 లక్షల ఎకరాల్లో సన్నాలు సాగు కానున్నట్లు అంచనా వేశామన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. భారీ వర్షం కురిసిన తరువాతనే రైతులు విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. గుర్తింపు లేని విత్తనాలు కొని మోసపోవద్దని పేర్కొన్నారు. లక్ష ఎకరాల్లో పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 49 వేల మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

నల్లగొండ టూటౌన్ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల స్థానానికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా మంగళవారం నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో పార్టీ ముఖ్య కార్యకర్త సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. సమావేశం అనంతరం కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

రవాణా చెక్‌పోస్టులు ఎత్తివేత!

- ఉమ్మడి జిల్లాలో కోదాడ, వాడపల్లి, సాగర్ వద్ద చెక్‌పోస్టులు
- అవినీతికి ఆనవాళ్లుగా మారాయని ఆరోపణలు
- ఎన్నికల అనంతరం ఎత్తివేసే యోచనలో ప్రభుత్వం



కోదాడ సమీపంలో ఉన్న తెలంగాణ- ఏపీ సరిహద్దు రవాణా చెక్‌పోస్ట్

కోదాడ: అవినీతి నిలయాలుగా మారాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న రవాణా శాఖ అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను ప్రభుత్వం త్వరలో ఎత్తివేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖకు 15 చెక్‌పోస్టులు ఉండగా వాటిలో మూడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్నాయి. తెలంగాణ ఏర్పడిన తరువాత కోదాడ వద్ద తెలంగాణ- ఏపీ సరిహద్దులో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై , వాడపల్లి (విష్ణుపురం)వద్ద అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిలో, నాగార్జునసాగర్ వద్ద హైదరాబాద్-సాగర్‌రోడ్డులో రవాణా శాఖ చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఒక్కో చెక్‌పోస్టు వద్ద 10 నుంచి 15 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చే వాహనాల పర్మిట్‌లను తనిఖీ చేయడం, నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించడం వీరి పని. కానీ ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని, వాహనదారుల నుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో వీటి పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వాటిని ఎత్తివేసి, అందులో పని చేస్తున్న 150 మంది సిబ్బందిని అవసరమైన చోట వినియోగించుకోవాలని చూస్తున్నట్లు సమాచారం.

ముక్కుపిండి వసూళ్లు..

వాహనాలకు అన్ని అనుమతులు ఉన్నా ఈ చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది వాహనదారుల నుంచి ఎంట్రీ ఫీజు పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ చెక్ పోస్టుల వద్ద డ్యూటీలు చేయడానికి సిబ్బంది పోటీ పడుతున్నట్లు సమాచారం. ఇక ఓవర్‌లోడ్ పేరుతో, పశువులను రవాణా చేసే వాహనాల నుంచి భారీగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొన్ని చెక్‌పోస్టుల వద్ద అనధికార సిబ్బందిని నియమించుకొని వసూళ్లకు పాల్పడుతున్నారు. తమ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ప్రతి నెలా వీరు కొంత మందికి నెలవారీ వేతనాలు లక్షల్లో ఇస్తున్నారని తెలిసింది.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను ఎత్తివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నాం. చిన్న చిన్న లోపాలను సాకుగా చూపి చెక్‌పోస్టు సిబ్బంది లారీల డ్రైవర్ల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అన్ని అనుమతులను ఆన్‌లైన్‌లో ఇస్తున్నందున ఈ చెక్‌పోస్టులను ఎత్తివేయడమే మంచిది.
– కనగాల నాగేశ్వరరావు, కోదాడ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు

ఆన్‌లైన్‌లోనే అనుమతులు జారీ చేస్తున్నందున..

జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత సరిహద్దులో ఏర్పాటు చేసిన వాణిజ్య పన్నుల శాఖ చెక్‌పోస్టులను ప్రభుత్వం ఎత్తివేసి రవాణా శాఖ చెక్‌పోస్టులను మాత్రం కొనసాగిస్తోంది. వాస్తవానికి రవాణా శాఖకు చెందిన అన్ని అనుమతులు, పర్మిట్‌లను ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తున్నందున ఈ చెక్‌పోస్టులను ఎత్తివేయాలని గతంలో కేంద్ర ప్రభుత్వం కోరినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా ప్రభుత్వం ఈ చెక్‌పోస్టుల్లో జరుగుతున్న అవినీతిపై దృష్టిసారించి వెంటనే వీటిని ఎత్తివేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఈ చెక్ పోస్టులను ఎత్తివేయనున్నట్లు సమాచారం.

పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు ఇబ్బందులు కలగొద్దు

- కలెక్టర్ హరిచందన



ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన



అనిశెట్టిదుప్పలపల్లి గోదాములో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ : పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన పేర్కొన్నారు. సోమవారం నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులకు అసౌకర్యం కలగకుండా హెల్ప్ డెస్క్, టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి శ్రీదేవి తదితర అధికారులు ఉన్నారు.

పోస్టల్, హోం ఓటింగ్‌లో పాల్గొన్న 5555 మంది

హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ద్వారా జిల్లా వ్యాప్తంగా మొత్తం 5555 ఓటు హక్కు వినియోగించుకున్నారు. హోం ఓటింగ్‌లో 883 మంది వృద్ధులు ఓటు వేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 750 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1258 మంది దివ్యంగ ఓటర్లకుగాను ఇప్పటివరకు 1173 మంది ఓటు వేశారు. అత్యవసర సేవలు అందించే వారు 62 మందికిగాను 32 మంది ఓటు వేశారు. జిల్లాలోని ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా సోమవారం ఒక్క రోజే 2,877 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉపఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రంగా ఏర్పాటు చేసిన అనిశెట్టి దుప్పలపల్లి గోదాంలో ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు నాలుగు హాల్స్ ఏర్పాటు చేసి ప్రతి హాల్‌లో 25 టేబుల్స్ వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో స్ట్రాంగ్ రూం, రూఫ్ సరిగా వచ్చేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూమయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

రూ.10లక్షల నగదు స్వాధీనం

● భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర

భువనగిరి క్రైం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సోమవారం పోలీసులు తనిఖీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా రూ.10,09,480 నగదు స్వాధీనం చేసుకున్నట్లు భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇద్దరిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి సోమవారం వరకు 4,189.81 లీటర్ల మద్యం, రూ.1,22,50,030 నగదు, 5.91 కిలోల గంజాయి, 53 జిలిటెన్ స్టిక్స్, 6925 కేజీల ఐరియల్ బూస్టర్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు 658 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 14 లైసెన్స్ గన్‌లను డిపాజిట్ చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు.



రాజేశ్ చంద్ర, డీసీపీ

313 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు

● నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు నల్ల గొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడు కంపెనీల కేంద్ర బలగాలు, 2600 మంది జిల్లా సిబ్బందితో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నల్ల గొండ జిల్లా వ్యాప్తంగా 1677 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిలో 313 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని అన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో గట్టి నిఘా పెట్టడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద ఏడు కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసిన ఉపాధ్యాయ దంపతులు

నల్లగొండ: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సోమవారం కూడా కొనసాగింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ కళాశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడికి ఎన్నికల సిబ్బంది పెద్ద సంఖ్యలో రావడంతో ఓటు వేసేందుకు వారు దాదాపు గంట సమయం లైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. ఎండాకాలం కావడం, ఓటు వేసేందుకు ఎక్కువ సమయం పట్టడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు.

'పోస్టల్ బ్యాలెట్' ను సద్వినియోగం చేసుకోవాలి



ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సూర్యాపేటటౌన్: ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంక సూచించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 8వ తేదీ వరకు ఈ కేంద్రాలు ఉంటాయన్నారు. ఇప్పటి వరకు 1,435 మంది ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎంపీఓ గోపి పాల్గొన్నారు.

వైఎస్సార్ శిష్యులం.. మాటిస్తే తప్పం

- 'కారు' షెడ్డుకు పోయింది.. కేసీఆర్ దవాఖానాకు పోయిండు
- కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులను జైలుకు పంపిస్తాం
- భువనగిరిలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమైంది
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



కార్నర్ మీటింగ్‌కు హాజరైన కార్యకర్తలు, ప్రజలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

యాదగిరిగుట్ట: 'మేము వైఎస్సార్ శిష్యులం.. మాట ఇస్తే తప్పం' అని కాంగ్రెస్ పార్టీ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట చౌరస్తాలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలో కారు షెడ్డుకు పోయిందని.. కేసీఆర్ దవాఖానాకు పోయిండని అన్నారు. భువనగిరిలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు సరైన అభ్యర్థులు లేరని విమర్శించారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీగా విజయం సాధించడం ఖాయమన్నారు. త్వరలోనే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును జైలుకు పంపిస్తానన్నారు. ఇప్పటికే కేసీఆర్ కూతురు కవిత తీహార్ జైలుకు వెళ్లిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన అందిస్తుందన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆలేరు నియోజకవర్గం నుంచి చామలకు భారీ మెజార్టీని అందించాలని కోరారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించేందుకు గ్రామాల్లో ప్రజలు ముందుకు వస్తున్నారని అన్నారు. గత పాలకులు రాష్ట్రంలోని ప్రజలను ఆగం చేశారన్నారు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు, ప్రజల దీవెనలు తనపై ఉన్నాయన్నారు. తనను గెలిపిస్తే భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్నర్ మీటింగ్‌లో టీపీసీసీ రాష్ట్ర నాయకుడు జనగాం ఉపేందర్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు కానుగు బాలరాజు, బందారపు భిక్షపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపు 'చెయ్యి'కి చిక్కాలి



భువనగిరి పట్టణంలో సోమవారం నిర్వహించిన మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి చేపను బహూకరిస్తున్న తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మత్స్యకారులు.

– భువనగిరిటౌన్

పారదర్శకంగా ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ

● సూర్యాపేట కలెక్టర్ ఎస్. వెంకటరావు



ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్. వెంకటరావు

సూర్యాపేట : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల కమిషనింగ్ (బ్యాలెట్ పేపర్ అనుసంధానం) ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంల కమిషనింగ్, మాక్‌పోల్ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈవీఎంల కమిషనింగ్, మాక్‌పోల్ ప్రక్రియను అప్రమత్తంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ వేణుమాధవ్, తహసీల్దార్లు శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య, మహేందర్‌రెడ్డి, ఎన్నికల ట్రైనర్లు, సిబ్బంది, అధికారులు ఉన్నారు.

'మిర్యాల'లో పూర్తయిన ప్రక్రియ

మిర్యాలగూడ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈవీఎం, వీవీ ప్యాట్‌ల కమిషనింగ్ ప్రక్రియ సోమవారం పూర్తయిందని ఆర్డీఓ, రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌లను స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి సీల్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు హరిబాబు, శ్రీనివాస్‌శర్మ, జవహర్ లాల్, సురేష్, డీఏ బాలాజీనాయక్, ఆర్‌ఐలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా కేంద్రంలోని అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన జనసభలో అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ నేతలు



నల్లగొండలో జేపీ నడ్డాకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు



చౌటుప్పల్‌లో నిర్వహించిన జనసభలో మాట్లాడుతున్న జేపీ నడ్డా, పక్కన ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య

ఎన్నికల విధుల్లో వలంటీర్లు

● ఒక్కో పోలింగ్ బూత్‌కు ముగ్గురు చొప్పున నియామకం



చిలుకూరు ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణకు హాజరైన వలంటీర్లు

చిలుకూరు: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలీసులు, పోలింగ్ అధికారులకు సహాయ సహకారాలు అందించేందుకు ఎన్నికల కమిషన్ పోలింగ్ బూత్‌ల వద్ద వలంటీర్లను నియమించింది. పోలీస్ సిబ్బంది కొరత వలన ఒక్కో బూత్ వద్ద ఒకే ఒక్క పోలీసును బందోబస్తుగా ఉంచుతున్నారు. దీని వలన ఇబ్బందులు ఎదురవ్వకుండా అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బందిని పోలింగ్ కేంద్రాల వలంటీర్లుగా నియమించారు. ఒక్కో బూత్‌కు ముగ్గురు వలంటీర్లను నియమించారు. వీరికి మండలాల వారీగా శిక్షణ ఇస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని ఆయా మండలాల్లో మరో రెండు రోజుల్లో శిక్షణ పూర్తికానుంది. పోలింగ్ రోజున వీరికి డ్రెస్ కోడ్ కూడా ఇచ్చే ఆలోచన ఉన్నట్లుగా తెలిసింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఐదో రోజు 13 మంది నామినేషన్లు

నల్లగొండ: ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి సోమవారం ఐదో రోజు 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నుంచి ముంద్ర మల్లికార్జునరావు, ధర్మ సమాజ్ పార్టీ నుంచి బరిగల దుర్గాప్రసాద్, నేషనల్ నవక్రాంతి పార్టీ నుంచి కర్ని రవితో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా పులిపాక సుజాత, చీదల్ల వెంకట సాంబశివరావు, చీదల్ల ఉమామహేశ్వరి, తాడిశెట్టి క్రాంతి కుమార్, అయితగోని రాఘవేంద్ర, బక్క జడ్సన్, బుగ్గ శ్రీకాంత్, పాలకూరి అశోక్ కుమార్, దేశగాని సాంబశివరావు నామినేషన్లు వేశారు. వీరంతా తమ నామినేషన్ పత్రాలను నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్. మహేందర్‌కు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నడ్డి శ్రీను (ఫైల్)

గుర్రంపోడు: మండలంలోని మొసంగి గ్రామంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఈ విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ బి. శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మొసంగి గ్రామానికి చెందిన నడ్డి శ్రీను(40)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడు గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన శీలం సైదాబాబు, చల్లా శంకర్ అతడిని వర్షం వచ్చేలా ఉందని మిరపకాయలపై పట్టా కప్పేందుకు తీసుకొని వెళ్లారు. రాత్రి సైదాబాబు, శంకర్‌లు ఇంటికి వచ్చి నిద్రించగా.. నడ్డి శ్రీను ఇంటికి రాలేదు. సోమవారం గ్రామానికి చెందిన నడ్డి సైదయ్య అనే రైతు తన పొలం వద్దకు వెళ్తుండగా గ్రామ శివారులోని ముత్యాలమ్మ గుడి ముందు నడ్డి శ్రీను మృతిచెంది ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చాడు. కాగా తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని, విచారణ జరిపి శీలం సైదాబాబు, చల్లా శంకర్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీను భార్య నడ్డి రమణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతుడి శరీరం ఎడమ వైపు కాలిపోయి ఉందని, మిగతా ఇద్దరు పిడుగుపాటు వల్ల తాము స్పృహ కోల్పోయామని, స్పృహలోకి వచ్చిన తర్వాత ఇంటికి చేరుకున్నామని చెబుతున్నారని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ రవి

నల్లగొండ: టెట్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు ఆటంకంగా ఉన్న టెట్‌పై ఎస్సీటీఈ వివరణ తీసుకోవాలని కోరారు. ఎన్నికలు ముగిసేలోగా ఎస్సీటీఈ నుంచి వివరణ తీసుకుని, ఎన్నికలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నలప రాజు వెంకన్న, మురళయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ఎరనాగుల సైదులు, రాజశేఖర్, రమణ, ప్రభాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గీతకార్మికుడు మృతి



ఉషయ్య (ఫైల్)

కనగల్ : పిడుగుపాటుకు గురై కల్లు గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన కనగల్ మండల పరిధిలోని జి.యడవల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి ఉషయ్య (59) రోజువారీ మాదిరిగా సాయంత్రం సమయంలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీసి కిందకు దిగే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో చెట్టుపై పిడుగు పడడంతో ఉషయ్య చెట్టుపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. ఉషయ్య కుమారుడు గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

భువనగిరి క్రైమ్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ సోమవారం మృతి చెందింది. వివరాలు.. హైదరాబాద్‌లోని ధూల్‌పేటకు చెందిన రాజు తన బంధువు అనుబాయితో ఈ నెల 3న భువనగిరి పట్టణ సమీపంలోని స్వర్ణగిరికి బైక్‌పై వచ్చాడు. రేణుక గుడి వద్ద యూటర్న్ తీసుకుంటుండగా బైక్ అదుపుతప్పి కిందపడడంతో అనుబాయి(35)కి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను వెంటనే భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ కృష్ణస్వామి తెలిపారు.

చేతబడి నెపంతో వృద్ధురాలి హత్య



అలివేలమ్మ మృతదేహం

నడిగూడెం : వృద్ధురాలు హత్యకు గురైన సంఘటన అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ జి.అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురవరం గ్రామానికి చెందిన కొమ్ము అలివేలమ్మ (70) ఉదయం పదిన్నర గంటల సమయంలో ఇంటి ఆవరణలో ఒంటరిగా ఉంది. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు అలివేలమ్మ మెడకు తాడుతో ఉరి బిగించి హత్య చేశారు. ఆమె మనవడు సాయికృష్ణ ఇంటికి వచ్చి చూసేసరికి అలివేలమ్మ మృతి చెంది ఉంది. మృతురాలికి ఒక కొడుకు ఉన్నాడు. తన నాయనమ్మ అలివేలమ్మ చేతబడి చేస్తోందనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన హుస్సేన్, మరో వ్యక్తి కలిసి హత్య చేశారని మృతురాలి మనవడు సాయికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాయికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలివేలమ్మ మృతదేహానికి కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

ఈదురు గాలికి చెట్టుకూలి ఒకరికి తీవ్ర గాయాలు

నార్కట్‌పల్లి: అకాల వర్షం.. ఈదురు గాలు లకు చెట్టు కూలడంతో ఇంటి రేకులు పగిలి రేకుల కింద ఉన్న ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలో ప్రభుత్వ హైస్కూల్ సమీపాన కొండ గోపాల్‌గౌడ్ ఆదివారం తన రేకుల ఇంటిలో కూర్చున్నాడు. ఆ సమయంలో వీచిన ఈదురు గాలికి ఇంటి ఆవరణలో గల చెట్టు ఒక్కసారిగా కూలి రేకులపై పడడంతో రేకుల కిందనే ఉన్న గోపాల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి, కుటుంబ సభ్యులు అతడిని తక్షణమే స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

వాహనాల తనిఖీల్లో రూ.3.20 లక్షలు పట్టివేత

నార్కట్‌పల్లి : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో సోమవారం వాహనాలను తనిఖీ చేయగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.3.20 లక్షలను పట్టుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. నగదును సీజ్ చేసి జిల్లా కేంద్రంలోని ట్రెజరీ కార్యాలయంలో అప్పగించామని పేర్కొన్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- వ్యవసాయ బావిలో దూకిన మహిళ
- బయటకు తీసి సీపీఆర్ చేసిన అటుగా వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు
- చికిత్స పొందుతూ మృతి
- యాదగిరిపల్లిలో ఘటన



నాగమణి (ఫైల్)

యాదగిరిగుట్ట: వరకట్న వేధింపులకు ఓ వివాహిత బలైంది. ఈ ఘటన యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లిలో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిపల్లికి చెందిన బూడిద యాదయ్య– దేవమ్మ కూతురు నాగమణి (25) వివాహం జనగామ జిల్లా నాగారం గ్రామానికి చెందిన గడిపే ప్రవీణ్‌తో 2020 మార్చి 18న జరిగింది. ప్రవీణ్ నాగారంలో ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. నాగమణి– ప్రవీణ్ దంపతులకు ఇద్దరు పిల్లలు పుట్టారు. భర్త ప్రవీణ్, మామ సాయిలు, అత్త జానమ్మ కొన్నేళ్లుగా నాగమణిని మానసికంగా వేధించడంతోపాటు వరకట్నం కావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయాన్ని నాగమణి తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు నాగారం వెళ్లి పంచాయితీ సైతం పెట్టారు. అయినా భర్త, అత్త, మామల్లో మార్పు రాకపోగా వరకట్నం కోసం మరింత వేధించసాగారు. ఇటీవల నాగారంలో నాగమణిని భర్తతోపాటు అత్త, మామలు కొట్టి, తీవ్రంగా వేధించారు. దీంతో నాగారంలోని అత్తగారి ఇంటి నుంచి నాగమణి, ఇద్దరు పిల్లలను ఆమె తల్లిదండ్రులు గత శుక్రవారం యాదగిరిపల్లికి తీసుకువచ్చారు. ఇక్కడికి వచ్చాక కూడా భర్త ప్రవీణ్ తరచూ ఫోన్ చేసి ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో నాగమణి తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో యాదగిరిపల్లిలో ఇంటి వద్ద ఉన్న వ్యవసాయబావిలో దూకింది. అదే సమయంలో యాదగిరిపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు బావిలో నాగమణి దూకిన విషయాన్ని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. హెడ్‌కానిస్టేబల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ ప్రభాకర్, డ్రైవర్ శంకర్ బావిలోకి దిగి నాగమణిని బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న నాగమణికి సీపీఆర్ చేశారు. అనంతరం ఆమెను ప్రైవేట్ వాహనంలో యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో భువనగిరి జిల్లా కేంద్రం ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ వైద్య పరీక్షలు జరిపిన వైద్యులు నాగమణి మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్ వెల్లడించారు. మృతురాలికి మూడేళ్ల కుమారుడు, తొమ్మిది నెలల పాప ఉందని సీఐ పేర్కొన్నారు.

నీటి కాలువలో పడి వ్యక్తి మృతి

డిండి: ప్రమాదవశాత్తు నీటి కాలువలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం డిండి మండలంలోని ఎర్రారం గ్రామ సమీపంలో జరిగింది. వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన మోనేష్(34) తమ బంధువులు డిండి మండలంలోని ఎర్రారం సమీపంలో గల ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన శుభకార్యానికి హాజరయ్యాడు. ఈ క్రమంలో ఫంక్షన్‌హాల్ పక్క నుంచే వెళ్తున్న డిండి ప్రాజెక్టు కాలువలో ప్రమాదవశాత్తు అతడు పడిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి మోనేష్‌ను కాలువలోంచి బయటకు తీయగా.. అప్పటికే అతడు మృతిచెందాడు. కాగా ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రాజు తెలిపారు.

● సువాసనల నీడలో సేదదీరుతూ..



మల్లె చెట్టు పందిరిలో సేదదీరుతున్న మేకల జనార్దన్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : వేసవిలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఎండ వేడిమి నుంచి తట్టుకోవడానికి ప్రజలు ఇళ్లలో ఏసీలు, కూలర్లు ఏర్పాటు చేసి ఉపశమనం పొందుతున్నారు. అయితే భూదాన్‌పోచంపల్లిలో 13వ వార్డుకు చెందిన మేకల జనార్దన్‌రెడ్డి కుటుంబం మాత్రం చెట్ల చల్లటి నీడలో సేదదీరుతున్నారు. జనార్దన్‌రెడ్డి ఆరేళ్ల క్రితం ఇంటి ఆవరణలో తీగమల్లి, జాజిమల్లి, బొండు మల్లి అనే మూడు తీగ జాతి మల్లె మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి పెరిగి తీగంతా విస్తరించి పచ్చటి పందిరి అల్లుకుంది. అంతే కాక మల్లె పూలు విరబూసి సువాసనలు వెదజల్లుతున్నాయి. దాంతో జనార్దన్‌రెడ్డి కుటుంబం పగలంతా సువాసనలు వెదజల్లే చల్లటి నీడలో హాయిగా సేదదీరుతున్నారు.